- పార్వతీపురంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు
- స్థలం పరిశీలించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్, ఏఎస్పీ, ఆర్డీవో
- దశాబ్దాల సమస్యకు పరిష్కారం

# లైన్ క్లియర్



సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్, ఏఎస్పీ

# లైన్ క్లియర్

- పార్వతీపురంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు
- స్థలం పరిశీలించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, ఏఎస్పీ, ఆర్డీవో
- దశాబ్దాల సమస్యకు పరిష్కారం



ఆర్డీవో అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, ఏఎస్పీ తదితరులు

(పార్వతీపురం)

జిల్లాలోని బొబ్బిలి, సాలూరు పురపాలక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని పార్వతీపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు లైన్ క్లియర్ అయింది. ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఇప్పటికే పార్వతీపురం మండలం సంగంవలస పంచాయతీ సర్వే నెంబరు ఒకటిలో ఐదెకరాల భూమిని 2015, జనవరి 31న రెవెన్యూ అధికారులు కేటాయించారు. అప్పటి నుంచి ప్రాజెక్టు ప్రారంభానికి ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, వైస్‌చైర్మన్ బెలగాం జయప్రకాష్‌నారాయణ, ఆర్డీవో ఆర్.గోవిందరావు ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు. అవగాహన లేని కొంతమంది గిరిజనులు ప్రాజెక్టును తమ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని ఆందోళన చేపట్టారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు తమవంతుగా వారిలో అవగాహన కల్పించారు. దీంతో పాటు బొబ్బిలి, సాలూరు ప్రాంతాలకు మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు పలువురు ప్రజలను పంపి ప్రాజెక్టును పరిశీలించేలా చూశారు. అయితే అప్పట్లో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన వీసీహెచ్ అప్పలనాయుడు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో ఈ కార్యక్రమం ముందుకు వెళ్లలేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఈ మేరకు ఆర్డీవో గోవిందరావు అధ్యక్షతన శనివారం ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, ఏఎస్పీ సిద్దార్థ్ కౌశిల్‌తో పాటు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ రఫీ, తదితర అధికారులు, జట్టు సంస్థ నిర్వాహకురాలు పద్మజలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు ప్రారంభించడం ఇప్పటికే ఆలస్యమైందని, దీనిని త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని ఏకగ్రీవంగా తీర్మానిస్తూ సమావేశం నుంచే ప్రాజెక్టు నిర్వహించే స్థలాన్ని పరిశీలించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు అక్కడి నుంచి వెళ్లారు. ఆ ప్రాంతాన్ని ఏఎస్పీ పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రజలు నివాసం లేని ప్రాంతాల్లో ఇటువంటి ప్రాజెక్టును చేపడితే కొంతమంది అభ్యంతరాలు చెప్పడం ఏమిటని ఆర్డీవోను అడిగారు. ఎవరికీ ఇబ్బంది లేకపోయినప్పటికీ అవగాహన లేకపోవడంతో అభ్యంతరాలు తెలుపుతున్నారని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ ఏఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఏఎస్పీ స్పందిస్తూ త్వరితగతిన పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసరావుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రఫీ, సీఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Sun, 24 July 2016
epaper.andhrajyothy.com/c/11963264